## పేషెంట్ చెప్పేకథలు



# కార్చిచ్చు

డాక్టర్. ఆలూరి విజయలక్ష్మి

"హలో శృతీ! నువ్వేనా?!.... బ్రతికే వున్నావా నువ్వు?" ఫోనులో తన ఫ్రెండ్ డాక్టర్ దీపిక పలకరింపు విని నవ్వొచ్చింది శృతికి.

"నిన్నగాక మొన్న కలిశాం. అప్పుడు బాగానే వున్నావుకదే? పాపం! ఇంతలోనే ఏమయింది నీకు?" సానుభూతి కురిపించింది శృతి.

"నీ పాదాలెటువైపుకు తిరిగున్నాయ్? ముందుకా? వెనక్కా? అర్జంట్‌గా చెప్పు ముందు." శృతి సానుభూతిని పట్టించుకోకుండా ప్రశ్నలు కురిపించింది దీపిక.

"ఇంక సందేహంలేదు. బాగా ముదిరిపోయింది. వాల్తేర్ అప్‌లాండ్స్ హాస్పిటల్లో బెడ్ రిజర్వ్ చేయమని మన రేవతికిప్పుడే ఫోన్ చేస్తాను.... నువ్వు బెంగెట్టుకోకు. నేను దగ్గరుండి చేర్పిస్తాను" ఓదార్చింది శృతి.

"నువ్వు చక్కగా చచ్చిపోయావుకదా, నాతో ఎలా వస్తావ్?"

"ఇంక లాభంలేదు. ఆలస్యం అమృతం విషం. నే నిప్పుడే వచ్చేస్తున్నా."

"బాబ్బాబు! అంత పని చేయకే. మా వూర్లో నిన్నెరిగిన వాళ్ళను రక్షించు. ఇప్పుడు నిన్ను చూశారంటే దెయ్యమొస్తూందనుకుని ఝడుసుకుని. నాకు ట్రీట్‌మెంటిచ్చే ఛాన్సుకూడా యివ్వకుండా గుండాగి ఛస్తారు." అప్పటికిగాని దీపిక మాటల వెనక ఏదో గూఢార్థముందనే అనుమానం రాలేదు శృతికి.

"ఏమిటే నీ వాగుడు?" కసిరింది శృతి.

"వాగుడు కాదమ్మాయ్. నువ్వు చచ్చిపోయావని మా వూరు వూరంతా గగ్గోలెత్తిపోతూంది. ఇదేమిటి, నీ ప్రాణసఖికి నీ అంతిమ యాత్ర గురించి చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయావేమిటా అని ఓ గాలన్ కన్నీళ్ళు కార్చి, మా అన్నయ్యకు సంతాపాన్ని తెలుపుదామని ఫోన్ చేశా.... అవునూ ఎవడే ఈ పుకార్ల సమ్రాట్. యింత దారుణమైన పుకారు పుట్టించి జిల్లా అంతా జెట్ వేగంతో వ్యాపింపజేశాడు?" దీపిక మాటల్ని అచేతనురాలై వింటోంది శృతి.

ఒక్కసారి ఉదయం నుంచి జరుగుతున్న సంఘటనలు శృతి మనో నేత్రం ముందు కదిలాయి. యింకా నిద్ర లేవకుండానే ఫోను. 'డాక్టర్ శృతి హియర్' అనగానే ఠక్కున ఫోను పెట్టేశారు. పెద్దగా పట్టించుకోకుండా నిద్రలోకి జారిపోయిందితను. తరువాత లేచిన దగ్గరనుంచి హాస్పిటల్‌కు వచ్చేలోగా కనీసం పది ఫోనులు. తన పేరు వినగానే కొందరు ఏవో సందర్భం లేకుండా ఒకటి రెండు మాటలు మాట్లాడి ఫోన్ పెట్టేశారు. హాస్పిటల్‌కు వచ్చి యింకా అరగంట కాలేదు రాజమండ్రి నుంచి దీపిక ఫోను.


"దీపా! యింకా నేను చావలేదు. యిప్పుడప్పుడే చావను." తేరుకున్న శృతి నవ్వింది.

"హమ్మయ్య! ఆ హామీ యిచ్చావుకద! నేను సాయంత్రం వస్తున్నా నక్కడికి. ఒక వేళ మనసు మార్చుకుంటే, కాస్త నేను వచ్చేదాకా ఆగు." దీపిక మాటలకు నవ్వుతూ ఫోన్ పెట్టేస్తూ గుసగుసలు వినిపించి వెనక్కు తిరిగింది శృతి. కిటికీలో నుంచి ఆమె వైపు చూస్తూ చిన్నగా చెప్పుకుంటున్నారు. ఒకామె రయ్యిన నర్స్ అడ్డుకుంటున్నా ఆగక తలుపు తోసుకువచ్చి శృతి పాదాల్ని కళ్ళకద్దుకోసాగింది. ఆ హఠాత్సంఘటనకు గాభరాపడుతూ కాళ్ళను వెనక్కు లాక్కుంది శృతి.

"మా అమ్మే! మీరు కలకాలం బతకాలి. నా కూతురు ప్రాణం నిలిపావు. మీరు వెయ్యేళ్ళు సుఖంగా బతికి మాలాంటాళ్ళ ప్రాణాలు కాపాడాలి.... ఎవడమ్మా ఆ మాయదారి చచ్చినాడు. మీరు చచ్చిపోయారని పుకారు లేవదీశాడు? ఆడికే ఆ గతి పడతంది." రెండు చేతుల్తో కన్నీళ్ళు తుడుచుకుంటూ శృతిని దీవిస్తూ, పుకారు పుట్టించిన అజ్ఞాతవ్యక్తిని శపిస్తూం

విస్మృయం జోకు!

దొంగని పట్టుకోమన్నా. అంతేగాని వాడితో పాటు మిమ్మల్నీ కూడా మేడ దూకమన్నానా....!



దామె. అదే సందని బయట నిలబడి గుసగుసలాడుతున్నవారంతా బిలబిలమని లోపలికి వచ్చి తాము విన్న విషయంచెప్పి ఆమె బ్రతికున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.

వాళ్ళ కథనంలో తన చావుచుట్టూ అల్లబడిన అందమైన సినిమా కథకూడా శృతికి తెలిసింది. తనని అర్ధరాత్రి డెలివరీ కేస్ కోసమని చెప్పి తీసుకువెళ్ళినట్లు, పది లక్షలిస్తే విడిచిపెడతామని తన భర్తకు ఫోను చేసినట్లు, తన భర్త వాళ్ళడిగినంతా యిచ్చి తనను విడిపించుకు వచ్చినట్లు, ఆ అవమానం భరించలేక తను ఆత్మహత్య చేసుకున్నట్లు.... పది లక్షలు!! తమ యింట్లో చెట్లకు కాస్తున్నాయా లక్షలు ?!.... పేషెంట్స్ ఆదరణ వల్ల తను సంపాదిస్తూంది -తనతోపాటు మరి పది మంది బ్రతకడానికి ఉపయోగపడుతూంది తప్ప పోగయి లక్షలవడమా ?!.. ఎందుకీ పుకార్లు? తన మీద బురద చల్లడానికా ?.... ఈ పుకార్లు పుట్టించడం వెనక వున్న మెంటాలిటీ ఏమిటి ?.... ఆకతాయితనమా ?!.... అసూయా ?!.... పైశాచికమైన ఆనంద లబ్ధికోసమా ?

తరువాత రెండు మూడు రోజులు ఫోనులు, స్వయంగా వచ్చి కలిసే వ్యక్తుల పరంపర, వాళ్ళందరి భయం, ఉద్వేగం, ఆందోళన, తనను చూడగానే ముఖాలు సంతోషంతో విప్పారడం, కన్నీళ్ళు నింపుకుంటూ తను వారికి చేసిన మంచిని పునశ్చరణ చేయడం, ఆప్యాయతతో, అభిమానంతో తనను ఆశ్వీరదించడం.... .... శృతి హృదయం కదిలి, కదిలి, కరిగి కన్నీళ్ళు స్రవించాయి.తనకు తన పేషెంట్స్‌కి మధ్య కేవలం జబ్బు, డబ్బు సంబంధం కాక దానిని మించిన అపురూపమైన అనుబంధాన్ని వాంఛించే శృతి తన మృతిపట్ల వారి రియాక్షన్‌ని చూసి తన జన్మ సార్ధకమయినట్లు పొంగిపోయింది. మహానుభావులు ఏ వుద్దేశ్యంతో, ఏ ప్రయోజనాన్నాశించి ఈ పుకారు లేవదీశారో కాని తనకోగొప్ప వుపకారం చేశారు. తనకో అద్భుతమైన అనుభవాన్ని కలిగించారు....తను కాలగర్భంలో కలిసిపోతే తనకోసం అశ్రుతర్పణ చేసేవారు యింతమంది వున్నారన్న భావన ఆమె హృదయాన్ని బరువెక్కిస్తూంది. తన అంచనాను మించి సహృదయతను, అభిమానాన్ని కురిపిస్తున్న సీదా, సాదా వ్యక్తుల్నిచూసి మనుషులమీద, మానవత్వంమీద నమ్మకాన్ని పెంచుకుంటూ, డాక్టర్‌గా, వ్యక్తిగా తను ఔన్నత్యతను పొందినట్లు అనుభూతి పొందుతూంది శృతి. ●

